క్లుప్తంగా

గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా దివాకరరెడ్డి

గూడూరు: గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా వై. దివాకరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నగరి మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న దివాకరరెడ్డిని గూడూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రసాద్‌గౌడ్ తన పూర్వ స్థానం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా వెళ్లారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.378 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

హంద్రీ నదికి గాజులదిన్నె ప్రాజెక్టు నీరు



గోరంట్ల వద్ద పారుతున్న జీడీపీ నీరు

కోడుమూరు రూరల్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల హంద్రీనది ఎండిపోవడంతో నదీ పరివాహక ప్రాంతాలైన గోరంట్ల, ఎర్రగుడి గ్రామాల్లో తీవ్ర నీటి సమస్య తలెత్తింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు గత రెండు రోజుల నుంచి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 30 క్యూసెక్కుల నీటిని వర్కూరు శుద్దవాగు మీదుగా హంద్రీనదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీళ్లు ప్రస్తుతం కోడుమూరు మీదుగా ముడుమలగుర్తి, గోరంట్ల హంద్రీనదిలో చేరుతున్నాయి. దీంతో గోరంట్లవాసుల నీటి కష్టాలు తొలగిపోయాయి. నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌జీఎంలో డేటా సైన్స్ ల్యాబ్ ప్రారంభం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డేటా సైన్స్ స్పెషలైజ్డ్ ల్యాబ్‌ను చెర్మన్ శాంతిరాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అనువైన విద్యాబోధన కోసం ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. క్లౌడ్ కంప్యూటరింగ్, మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా కంప్యూటర్ విజన్, జనరల్ కంప్యూటరింగ్ ల్యాబ్‌లు ఇందులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎండీ శివరాం, డీన్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ నిబంధనల మేరకు హిందూ మతస్తులైన 7 మంది సభ్యులతో కూడిన పాలకవర్గంలో ఎస్సీ మహిళ-1, బీసీ మహిళ-1, ఎస్టీ మహిళ-1, ఓసీ మహిళ-1, నాయీబ్రాహ్మణులకు సంబంధించి పురుషుడు-1, ఓసీ పురుషులు-2 చొప్పున అభ్యర్థులు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను 2024 ఫిబ్రవరి 20వ తేదీలోగా కర్నూలు డీసీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సరితకు ఆర్ట్ చాలెంజ్ అవార్డు



నటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సరిత

పాణ్యం: పాణ్యం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు క్రీ.శే తిరుమల కుమార్తె సరిత హాస్యనటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా ఆర్ట్ చాలెంజ్ అవార్డు అందుకున్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల ఒకటో తేదీ బ్రహ్మానందం పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చిత్ర కళ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 323 మంది చిత్ర కళాకారులు పాల్గొన్నారన్నారు. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు కల్పించండి

పాణ్యం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు నంద్యాల కలెక్టర్ శ్రీనివాసులుకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు లేక ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యార్థి నాయకులు కుమార్ ప్రతాప్, శివ, రాజు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో బోధనాసుపత్రి

- ఎన్నడూ లేని విధంగా పురోగతి
- స్పెషాలిటీతో పాటు సూపర్ స్పెషాలిటీకి పెరిగిన పీజీ సీట్లు
- 126 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు
- అధిక సంఖ్యలో వైద్యులకు పదోన్నతులు
- రూ.500 కోట్లతో బోధనాసుపత్రి ఆధునికీకరణ
- నిర్మాణం పూర్తి చేసుకున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్



కర్నూలు మెడికల్ కాలేజీ

ఇది కదా.. అభివృద్ధి

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు మేరా కేఎంసీ మహాన్ అనే వారు. కాలక్రమేణా పాలకులు ఈ కళాశాలపై చిన్నచూపు చూడటం, పర్యవేక్షణ లోపించడంతో కొన్నేళ్ల పాటు ఈ కళాశాల ప్రతిభ తగ్గిపోయింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ కళాశాలకు మళ్లీ పూర్వ రోజులు వస్తున్నాయి. కళాశాల, ఆసుపత్రిలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకాలు, వైద్యులకు పదోన్నతులు, పరస్పర బదిలీలకు అంగీకారం జరిగాయి. నాడు-నేడు కింద రూ.500 కోట్లతో బోధనాసుపత్రి ఆధునికీకరణ జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని కర్నూలు నుంచి హైదరాబాద్‌కు మార్చే సమయంలో(1956లో) ఈ ప్రాంతానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు చేసి వెళ్లారు. అప్పట్లో కళాశాల భవనాలు లేకపోవడంతో రెండేళ్ల పాటు 50 ఎంబీబీఎస్ సీట్లతో గుంటూరు మెడికల్ కాలేజీలో తరగతులు నిర్వహించారు. అనంతరం కర్నూలులోనే కళాశాలను కొనసాగించారు. 2018 వరకు 200 సీట్లున్న దానిని 2019లో మరో 50 సీట్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 250 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాల కొనసాగుతోంది. ఒకప్పుడు పీజీ చదవాలంటే వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి స్థితి నుంచి ఇక్కడే పీజీతో పాటు సూపర్‌స్పెషాలిటీ కోర్సును సైతం చదివే అవకాశం ఈ ప్రభుత్వంలో లభించింది. 2019కి ముందు సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో కేవలం కార్డియాలజీ విభాగానికి ఒక్కటే రెండు పీజీ సీట్లు ఉండేవి. 2019 తర్వాత ఇతర సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లోనూ పీజీ సీట్లు మంజూరయ్యాయి. మొత్తం 8 విభాగాల్లో 13 సీట్లు మంజూరు కావడంతో వైద్యవర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అలాగే స్పెషాలిటీ కోర్సుల్లోని పీజీ సీట్లు 2019కి ముందు 138 మాత్రమే ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక అదనంగా మరో 26 సీట్లు పెరిగి మొత్తం పీజీ సీట్ల సంఖ్య 164కు చేరింది. అలాగే గత ప్రభుత్వ హయాంలో 300 వరకు మాత్రమే స్టాఫ్‌నర్సులు ఉండేవారు. ఈ ప్రభుత్వ హయాంలో ఈ సంఖ్య 800లకు పెరిగింది. దీనివల్ల రోగుల పట్ల నర్సింగ్ కేర్ మరింత పెరిగింది.

2019 తర్వాత పెరిగిన పీజీ సీట్లు

2019 వరకు 140 దాకా ఉన్న పీజీ సీట్ల సంఖ్య ఈ ప్రభుత్వంలో మరో 35 మంజూరయ్యాయి. అందులో మైక్రోబయాలజీ 4, పాథాలజీ 4, ఫోరెన్సిక్ మెడిసిన్ 5, ఆర్థోపెడిక్స్ 2, గైనకాలజీ 6, అనెస్తీషియా 3, పీడియాట్రిక్స్ 4, ఈఎన్‌టి 2, టీబీసీడీ 2, రేడియోథెరపీ 1, సైకియాట్రి 3 సీట్లు మంజూరయ్యాయి. ఇవే గాక 2019 వరకు నాలుగు మాత్రమే ఉన్న సూపర్‌స్పెషాలిటీ సీట్ల సంఖ్య అదనంగా మరో 15 జతయి 19కి చేరాయి. ఇందులో న్యూరోసర్జరీ 2, నెఫ్రాలజీ 2, ప్లాస్టిక్ సర్జరీ 1, యురాలజీ 2, పీడియాట్రిక్ సర్జరీ 2, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 2, ఎండోక్రైనాలజీ 2, న్యూరాలజీ 2 సీట్లు మంజూరయ్యాయి.

కొత్తగా నియమకాలు, వైద్యులకు పదోన్నతులు

కేఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో ఏకంగా 126 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిగింది. దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న సీనియర్ వైద్యుల సేవలను గుర్తించి వారికి పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు అప్పటి వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా దశాబ్దానికి పైగా పనిచేస్తున్న వారిని అసోసియేట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్‌గా పని చేస్తున్న వారిని ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. దీంతో పాటు అదనంగా నాలుగు ప్రొఫెసర్, 22 అసోసియేట్, 61 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేశారు. వైద్యులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించేందుకు గాను ముందుగా దీర్ఘకాలంగా ఒకేచోట ఉన్న వారిని బదిలీలు చేశారు.అనంతరం సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించి కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించారు. దీంతో పాటు వైద్యుల వినతి మేరకు పరస్పర బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీనివల్ల వారు కోరుకున్న ప్రాంతానికి చాలా మంది వైద్యులు బదిలీపై తిరిగి వచ్చారు. ఒకేసారి పదుల సంఖ్యలో వైద్యులు పరస్పర బదిలీలపై రా వడం ఇదే మొదటసారని వైద్యుల్లో చర్చ జరుగుతోంది.

నా జీవితంలో ఇలాంటి అభివృద్ధి చూడలేదు



నా 30 ఏళ్లకు పైగా సర్వీసులో ఎన్నడూ కర్నూలు మెడికల్ కాలేజీ ఇంతలా అభివృద్ధి జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నిధులు కేటాయించడం వల్ల ఇది సాధ్యమైంది. కళాశాల, ఆసుపత్రిలో ఎక్కడా ఒక్క పోస్టు కూడా ఖాళీ ఉండకుండా ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు జా రీ చేసి ఉద్యోగాలు భర్తీ చేసేలా ప్రభుత్వం ఆదేశా లు జారీ చేసింది. యూజీ, పీజీ సీట్లతో పాటు ఎప్పుడూ లేని విధంగా సూపర్‌స్పెషాలిటీ సీట్లు కూడా పెరగడం, మంజూరు కావడం విశేషం.

–డాక్టర్ పి. సుధాకర్, ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం



ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. అదనంగా మరి కొన్ని పోస్టులు మంజూరయ్యాయి. దీనివల్ల అన్ని విభాగాల్లో వైద్యులున్నారు. దీనివల్ల రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యం అందిస్తున్నాము. ఈ మేరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు అదనంగా ఈవినింగ్ ఓపీ నిర్వహిస్తున్నాము. దీనివల్ల పరీక్షల నివేదికలు అందుకున్న రోగులు మరుసటిరోజు, మరో వారం వేచి చూడకుండా అదే రోజే వైద్యులను సంప్రదించి చికిత్స చేసుకునే అవకాశం లభించింది.

–డాక్టర్ వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

నాడు-నేడు కింద సమూల మార్పులు

నాడు-నేడు కార్యక్రమం ద్వారా కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రూ.350కోట్లు నిర్మాణాలకు, రూ.150కోట్లు పరికరాలకు కేటాయించారు. ఇందుకు సంబంధించి ఐపీ భవనం, కళాశాలలో లెక్చరర్ గ్యాలరీలు, సెమినార్‌హాళ్లు, హాస్టళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై నత్తనడకన పనులు సాగిన నిర్మాణాలు సైతం వేగం పుంజుకున్నాయి. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కోసం రూ.90కోట్లు, బర్న్స్ వార్డు కోసం 8.7కోట్లు, డైస్ భవన నిర్మాణం కోసం రూ.1.06కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే రూ.12.90కోట్లతో డయాగ్నోస్టిక్ భవన నిర్మాణం పూర్తయి రోగుల సేవలో తరిస్తోంది. ఈ భవనంలో పరికరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన రూ.10 కోట్లను సైతం ఇటీవల మంజూరు చేశారు. దీంతో పాటు 250 విద్యార్థులకు అనుగుణంగా ఎగ్జామినేషన్ హాలు, లెక్చర్ హాల్, ఉమెన్స్ పీజీ హాస్టల్, క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేలా కళాశాల మైదానం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.



నిర్మాణం జరుపుకుంటున్న నూతన బర్న్స్ వార్డు

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

గడివేముల: మండలంలోని దుర్వేసి గ్రామానికి చెందిన చల్లా వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.పింఛన్ సొమ్ము తీసుకోలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ శిరీష సొంత ఖర్చులతో సోమవారం ఆస్పత్రికి వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ సొమ్ము అందజేసింది. వలంటీర్‌ను సర్పంచ్ మండ్ల మమత, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



చల్లా వెంకటస్వామికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ఈకేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు



బురాన్‌దొడ్డిలో ఈ-కేవైసీని పరిశీలిస్తున్న ఏఓ



ఆర్‌బీకేలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ

కోడుమూరు: రబీలో పంట నమోదు చేయించుకున్న రైతుల ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని ప్యాలకుర్తి, వర్కూరు, ముడుమలగుర్తి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించడంతో పాటు, ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. రబీ కింద పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు సంబంధించిన ఈకేవైసీని ఆర్‌బీకే సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని, పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించడంతో పాటు పంట బీమా అందుతుందన్నారు. సిబ్బంది రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని సూచించారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

సి.బెళగల్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో ఆయన పర్యటించారు. వ్యవసాయ సిబ్బంది చేస్తున్న పంట నమోదును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈనెల 10వ తేదీలోగా ఈ-కేవైసీ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందాలంటే తప్పనిసరిగా వేలిముద్రలు వేయాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

కల్లూరు: కల్లూరు మండల తహసీల్దార్‌గా సి.మునివేలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న రమేష్ బాబును వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి తహసీల్దార్‌గా పనిచేస్తున్న సి.మునివేలు కల్లూరు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



అనుపమకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

సి.బెళగల్ తహసీల్దార్‌గా అనుపమ

సి.బెళగల్: మండల నూతన తహసీల్దార్‌గా అనుపమ సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడున్న శేషఫణి అనంతపురం జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న అనుపమ ఇక్కడికి వచ్చారు. ఆమెకు వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా చేస్తానని, మండల ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని ఆమె తెలిపారు. మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే, ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఏఎస్ఓ ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ మధు ఉన్నారు.

గూడూరు తహసీల్దార్‌గా ఉదయ్‌సంతోష్

గూడూరు: మండల తహసీల్దార్‌గా ఉదయ్‌సంతోష్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణ వైఎస్సార్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో తిరుపతి జిల్లా రేణిగుంటలో పని చేస్తున్న వి.ఉదయ్‌సంతోష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.





మునివేలు, ఉదయ్‌సంతోష్

ఓర్వకల్లు తహసీల్దార్‌గా నటరాజ్



నటరాజ్

ఓర్వకల్లు: మండల నూతన తహసీల్దార్‌గా నటరాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శివప్రసాద్‌రెడ్డి ఉమ్మడి అనంతపురం జిల్లా సత్యసాయి జిల్లా తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లిన విషయం విధితమే. ఆయన స్థానంలో అదే జిల్లా కదిరి అర్బన్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి.నటరాజ్ ఇక్కడికి వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ సతీష్, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కోడుమూరు ఎస్ఐ బాధ్యతల స్వీకారం



బాలనరసింహులు

కోడుమూరు: కోడుమూరు ఎస్ఐగా బాలనరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులు కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా, కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న బాల నరసింహులును కోడుమూరుకు బదిలీ చేశారు.దీంతో ఆయనసోమవారం బాధ్యతలు తీసుకున్నారు.

కె.నాగలాపురం ఎస్ఐగా శ్రీనివాసులు

గూడూరు రూరల్: కె.నాగలాపురం ఎస్ఐగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సోమ్లానాయక్‌ను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కోడుమూరు ఎస్ఐగా పని చేస్తున్న శ్రీనివాసులు కె.నాగలాపురం వచ్చారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ శేషారెడ్డి

గూడూరు: ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు ఆర్డీఓ శేషారెడ్డి అన్నారు. సోమవారం గూడూరు రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కోడుమూరు నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య, పోలింగ్ బూత్‌లు, సమస్యాత్మక ప్రాంతాల విషయాలపై ఆరా తీశారు. ఎన్నికలు సాఫీగా జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, డీటీ శారద, వీఆర్వోలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయరాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయరాదన్నారు. ప్లాంట్‌కోసం భూములు తీసుకుంటే తమకు జీవనాధారం ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ సృజనకు వినతిపత్రం ఇచ్చారు.

పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువు

ఓర్వకల్లు: మండలంలోని పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు శ్రీధర్, షాజహాన్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలో సుమారు 9 పెట్రోల్ బంకులు ఉన్నాయని తెలిపారు. అయితే ఒక్క బంకులో కూడా నిబంధనల ప్రకారం వాహనదారులకు కల్పించాల్సిన సదుపాయాలు లేవన్నారు. చాలా చోట్ల తాగునీరు, మరుగుదొడ్లు, గాలిపంపులు లేకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు విచారణ జరిపించి పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మద్దయ్య, లింగన్న, అంజి, దస్తగిరి, జాకీర్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పకడ్బందీగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు



ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లపై ఆరా తీస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ అబ్బాస్‌నగర్, రామచంద్రనగర్‌లోని వార్డు సచివాలయాల్లో జరుగుతున్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పట్టాలు కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు వారికి పూర్తి హక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తోందని తెలిపారు. రిజిస్ట్రేషన్లలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు, కల్లూరు తహసీల్దార్ మునివేలు, కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ హాజీ మియ్య ఉన్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

కోడుమూరు రూరల్: స్పందనలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ దీప్తి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ దీప్తి, డీటీ రామాంజినేయులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్పందనలో భాగంగా వచ్చే సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డి, ఏపీఎం పుష్పావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కల్లూరు: జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, పంట నష్టపరిహారం రైతుల ఖాతాలకు జమ చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ కల్లూరు ఏరియా వార్డుల సమితి ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పత్తి, వేరుశనగ, ఆముదం, కంది, సజ్జ, జొన్న, కొర్ర పంటలకు ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం, ఉల్లి, మిర్చి, ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ. లక్ష పరిహారం ఇవ్వాలని కోరారు. నాయకులు శ్రీరాములు గౌడ్, ఖాజా, ముని, బీసన్న, బాబయ్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు విద్యార్థులే స్టార్ క్యాంపెయినర్స్

కర్నూలు సిటీ: విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్టార్ క్యాంపెయినర్స్ స్టూడెంట్స్ అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం నగరంలోని మైపర్ కాలేజీలో ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో కాలేజ్ కెప్టెన్స్ కార్యక్రమం నిర్వహించారు. దేశంలో ఎవరూ చేయని విధంగా విద్యా రంగానికి సీఎం వైఎస్ జగన్ రూ.73 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. విద్యా వ్యవస్థల్లో తీసుకొచ్చిన సంస్కరణలను ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేసిన జగనన్న రుణం తీర్చుకునేందుకు విద్యార్థులు స్టార్ క్యాంపెయినర్స్‌గా మారి ఆయనను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్ల సౌకర్యాలు, విద్యాబోధనలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారయ్యాయన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు ఐక్య రాజ్యసమితిలో ప్రసంగించే స్థాయికి చేరుకున్నారన్నారు. అనంతరం విద్యా రంగంలో వచ్చిన మార్పులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థి విభాగం కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు మణిరెడ్డి, సంతోష్, మధు, ఆర్‌యూ నాయకులు అఖిల్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్